క్లుప్తంగా

వన్‌బీ, అడంగల్ మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ముదిగుబ్బ: మండలంలో వివిధ బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు వన్‌బీ, అడంగల్ వెంటనే మంజూరు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ నారాయణ స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు పెద్దన్న మాట్లాడుతూ పంట రుణాల రెన్యూవల్ కోసం వన్‌బీతో పాటు రైతులు ఇబ్బందులు పడకుండా అడంగల్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, ఆవాజ్ కమిటీ ప్రధాన కార్యదర్శి బాబ్జాన్, ఆవాజ్ కమిటీ సభ్యులు చికెన్ రఫీ, అల్లాబక్షా, బాబా పకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

8న కంటి వైద్య శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జూన్ 8న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షులు జయసింహ తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో గురువారం రోటరీక్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. అవకాశాన్ని కంటిచూపు తగ్గిన నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోటరీక్లబ్ సభ్యులు రత్నశేఖర్‌రెడ్డి, కొండయ్య, పెద్దారెడ్డి, హరినాథ్, సుదర్శన్‌గుప్త, కృష్ణమూర్తి, నాగభూషణం, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ పీహెచ్‌సీకి నీటి సౌకర్యం



పీహెచ్‌సీ ఆవరణలో బోరు వేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులకు గురవుతుండేవారు. గురువారం పీహెచ్‌సీ ఆవరణలో నూతనంగా బోరు వేశారు. బోరు బావిలో పుష్కలంగా నీరు లభించిందని, పీహెచ్‌సీకి నీటి సమస్య తీరినట్లేనని వైద్య సిబ్బంది తెలిపారు.

పరిహారం పెంచాకే పనులు చేపట్టండి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నారాయణస్వామి

ముదిగుబ్బ: పుట్టపర్తి–ముదిగుబ్బ మధ్యన జరుగుతున్న జాతీయ రహదారి 342 రోడ్డు నిర్మాణ పనులను గురువారం కూడా రైతులు అడ్డుకున్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పెంచిన తరువాతనే పనులు చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ విలువ ఎకరానికి రూ.కోటి పలుకుతోందన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఎకరానికి కేవలం రూ.12 లక్షలను పరిహారం ఇస్తోందన్నారు. రైతుల ఆందోళన సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ నారాయణస్వామి రైతులను తహసీల్దార్ కార్యాలయం వద్దకు పిలిపించి వారితో చర్చలు జరిపారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం పెంచేలా చూస్తామని తహసీల్దార్ తెలిపారు. అయితే తమకు న్యాయం జరగకపోతే రోడ్డు పనులు జరగనీయకుండా అడ్డుకుంటామని రైతులు హెచ్చరించారు. వీరికి బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.



పత్యాపురంలో వేరుశనగ విత్తనాలు సిద్ధం చేస్తున్న మహిళలు

ఖరీఫ్ సాగుకు సిద్ధం

బత్తలపల్లి: ఖరీఫ్ వేరుశనగ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. మండలంలో ఇప్పటి వరకు మూడు దఫాలు పదునైన వర్షం కురవడంతో దుక్కులు చేసేందుకు రైతులు రెడీ అయ్యారు. విత్తనం వేసే సమయం ముంచుకు వస్తున్నందున పొలాల్లో కంది కొయ్యలు ఏరుతున్నారు. సేంద్రీయ ఎరువులను సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామాల్లో మహిళలు వేరుశనగ విత్తనాలను ఒలిచే పనుల్లో నిమగ్నమయ్యారు.



పట్టుగూళ్లు రాకపోవడంతో వెలవెలబోతున్న ట్రేలు

నాడు కళకళ...నేడు వెలవెల

ధర్మవరం రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా ధర్మవరం పట్టుగూళ్ల మార్కెట్‌కు పట్టుగూళ్లు రాకపోవడంతో వెలవెలబోతోంది. నాలుగు రోజులుగా ఒక్క లాటు కూడా రాకపోవడంతో పట్టు గూళ్ల మార్కెట్ కళాహీనంగా మారింది. ఒకప్పుడు రాష్ట్రంలోనే ధర్మవరం పట్టు గూళ్ల మార్కెట్‌కు ప్రత్యేక స్థానం ఉండేది. ఈ మార్కెట్‌కు ఇతర జిల్లాలతో పాటు కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి కూడా రైతులు పట్టు గూళ్లను తీసుకొచ్చేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మల్బరీ రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడంతో మల్బరీ సాగుపై ఆసక్తి చూపడం లేదంటున్నారు. ఈనేపథ్యంలో జిల్లావ్యాప్తంగా మల్బరీ సాగు లేకపోవడంతో పట్టుగూళ్లు రాక మార్కెట్ వెలవెలబోతోంది. పరిస్థితి ఇలాగా కొనసాగితే పట్టు మార్కెట్ మూతపడే అవకాశం ఉందని పలువురు రైతులు అంటున్నారు. పూర్తి స్థాయిలో మల్బరీ సాగు తగ్గిపోతుండడంతో వీటిపై ఆధారపడిన అనేక మందికి జీవనోపాధి లేకుండా పోయే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా మల్బరీ సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



సాతార్లపల్లి వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

మలుపు.. ప్రమాదాల పిలుపు!

పుట్టపర్తి అర్బన్: పెడపల్లి నుంచి ఓడీచెరువు మండలం కొండకమర్ల వరకూ ప్రధాన రోడ్డుపై ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయని వాహనదారులు వాపోతున్నారు. మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. అదే రోడ్డుపై గంగిరెడ్డిపల్లి వద్ద ఆంజనేయస్వామి ఆలయం ఉండటంతో నిత్యం పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇక వర్షాకాలంలో చెట్లు మరింతగా పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి



అనుబంధ సంఘాల అధ్యక్షులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆ పార్టీ అనుబంధాల సంఘాల అధ్యక్షులకు సూచించారు. గురువారం పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కొత్తచెరువు మండల అనుబంధ సంఘాల అధ్యక్షులకు మండల కన్వీనర్ శ్యాంసుందరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి యం.మహాలక్ష్మి, కొత్తచెరువు యూత్ వింగ్ మండలాధ్యక్షుడు ఆర్.అజయ్‌భార్గవ్‌రెడ్డి, మహిళా విభాగం ఎం.ప్రభావతమ్మ, రైతు విభాగం వి.ఫణీంద్రరెడ్డి, బీసీ సెల్ పి.భాస్కర్, ఎస్సీ సెల్ ఎస్. రామాంజనేయులు, ఎస్టీ సెల్ ఈ.రామచంద్ర, మైనార్టీ సెల్ కెఎం. రఫీ, క్రిష్టియన్ మైనార్టీ సెల్ ఎం.కోదండరామయ్య, స్టూడెంట్ వింగ్ బి.యశ్వంతరెడ్డి, పంచాయితీరాజ్ వింగ్ టి.తిప్పారెడ్డి, ఆర్‌టీఐ విభాగం ఓ.శ్రీనివాస రెడ్డి, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా సి.రెడ్డప్పరెడ్డి, వీవర్స్ వింగ్ ఎస్.ఆంజనేయులు, వాణిజ్య విభాగం పి.రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ కె.గంగప్ప, అంగన్‌వాడీ వింగ్ ఎం.శ్యామలమ్మ, కల్చరల్ వింగ్ జి.సంజీవరాయుడు, సోషల్ మీడియా వింగ్ ఎన్.రాణాప్రతాప్ రెడ్డి, దివ్యాంగుల విభాగం బి.కేశప్ప, పబ్లిసిటీ వింగ్ మండల అధ్యక్షుడిగా పి.శ్రీనివాసరెడ్డిని పూల మాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కొత్తచెరువు మండల ఉపాధ్యక్షులు ఆలకుంట్ల శ్రీనివాసులు, యస్. మహబుబ్ బాషా, ప్రధాన కార్యదర్శులు వి.ప్రకాష్, ఎస్. శంకర్‌రెడ్డి, కార్యదర్శులు వి.మల్లికార్జున, సి.మహేష్, ఎం.కేశవ, కార్యవర్గ సభ్యులు ఎల్.రామాంజి, ఈ.రంగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో విత్తన వేరుశనగ పంపిణీ



తనకల్లులో విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

తనకల్లు: త్వరలో రాయితీ విత్తన వేరుశనగను పంపిణీ చేయనున్నట్లు ఏఓ శ్రీహరినాయక్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక రైతు సేవాకేంద్రంలో విత్తన వేరుశనగ నాణ్యతను రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 3,157 క్వింటాళ్ల విత్తన వేరుశనగను కేటాయించారన్నారు. ప్రస్తుతం మండలంలోని ఆరు ఆర్‌ఎస్‌కేలలో 700 క్వింటాళ్లను నిల్వ ఉంచామన్నారు. పై అధికారుల నుంచి ఆదేశాలు అందగానే మండల వ్యాప్తంగా విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్లను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శివన్న, రమణ, రైతులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

కదిరి టౌన్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎన్. రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక సబ్ జైలును తనిఖీ చేశారు. జైలులో ఖైదీలను ఉంచిన బ్యారక్‌లు, వంటగది, స్టోర్ రూం, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని జడ్జి వారికి సూచించారు. ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించాలని జైలు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ వాసుదేవరెడ్డి, న్యాయవాదులు నరసింహులు, దశరథనాయక్, రఘునాథ్, మెహతాజ్, పారా లీగల్ వలంటీర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



కృష్ణమూర్తి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నంకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మహేష్ తండ్రి, పార్టీ సీనియర్ నేత పెనుజూరి క్రిష్ణమూర్తి(83) తీవ్ర అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి క్రిష్ణమూర్తి ఇంటికి చేరుకుని ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం జిల్లాఅధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి,, మండల కన్వీనర్ కేశప్ప, మాజీ కన్వీనర్ సుధాకరరెడ్డి, జిల్లా అగ్రి బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, నాయకులు పతంజలి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నీలూరి ఈశ్వర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్లేష్, బీసీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

తలుపుల: మండలంలోని దండువారిపల్లి సమీపంలో వెలసిన కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం కాశీ విశ్వేశ్వర స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వేదపండితులు శివపార్వతులకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. గ్రామస్తులు భక్తాదులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ముళ్లపొదల తొలగింపు



ముళ్లపొదలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కనగానపల్లి: మండల కేంద్రం సమీపంలో కనగానపల్లి–మామిళ్లపల్లి రహదారి పక్కన మలుపు వద్ద ఉన్న ముళ్ల పొదలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. చెరువు కట్ట సమీపంలో మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న ముళ్ల పొదలపై సాక్షి దినపత్రికలో 'ములుపు ప్రమాదాలకు పిలుపు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం ములుపు వద్ద ములుపు పొదలను జేసీబీతో తొలగించారు. అలాగే రహదారి పక్కన గుంతల్లో మట్టి వేసి చదును చేయించారు.

సోలార్ ఏర్పాటుకు భూములు పరిశీలించండి

అమడగూరు: మండల వ్యాప్తంగా సోలార్‌ను ఏర్పాటు చేయడానికి భూములు పరిశీలించాలని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. గురువారం ఎన్‌టీపీసీ (నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్) కంపెనీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఎన్‌టీపీసీ కంపెనీ సోలార్‌ను ఏర్పాటు చేయడానికి మండల వ్యాప్తంగా 13 వేల ఎకరాల భూములు అవసరం ఉందన్నారు. భూములు ఇచ్చిన రైతులకు 30 ఏళ్లపాటు కంపెనీ నిబంధనల మేరకు డబ్బు చెల్లిస్తుందన్నారు. ఏడాదికి ఎకరానికి రూ.31 వేలతో అగ్రిమెంట్ చేసుకుని, ప్రతి రెండేళ్లకు 5 శాతం ఎక్కువగా ఇస్తారని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకూ మండల వ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాల భూములు గుర్తించామన్నారు. అయితే ఆయా భూములను పరిశీలించి ప్రభుత్వ, పట్టా భూములు ఎంతమేరకు ఉన్నాయో నివేదికలు సిద్ధం చేయాలని ఎన్‌టీపీసీ సిబ్బంది పేర్కొన్నారు.

ఆర్డీటీ సేవలను కొనసాగించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బత్తినవారిపల్లి గ్రామస్తులు

తనకల్లు: ఆర్డీటీ సేవలను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బత్తినవారిపల్లికి చెందిన గ్రామస్తులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. పేద కుటుంబాలకు విద్య, వైద్యం, గృహ నిర్మాణం, పాదుపు సంఘాలు, వికలాంగులకు, క్రీడలు, తదితర రంగాల్లో ఆర్డీటీ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పేదల పాలిట పెన్నిదిగా పేరుగాంచిన ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్డీటీ సేవలను యథావిధిగా కొనసాగించేలా ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివన్న, ప్రమీల, శంకర్‌నారాయణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో లయన్స్‌క్లబ్ ముందంజ



మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్

ధర్మవరం అర్బన్: సామాజిక సేవలో లయన్స్‌క్లబ్ నిరంతరం ముందంజలో ఉందని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్ పేర్కొన్నారు.పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోనున్న లయన్స్ కంటి ఆసుపత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బంది పనితీరు, కంటి ఆపరేషన్లు ఎలా జరుగుతున్నాయో ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఇప్పటికే వేల మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసి నిరుపేదలకు కంటిచూపును అందించారన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు పి.వెంకటస్వామి, క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి నాగేంద్ర, సభ్యులు గోసే రాధాకృష్ణ, పల్లెం వేణుగోపాల్, నాగరాజు, ఉట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన



ఆలయంలో ప్రతిష్టించిన రామలింగేశ్వరస్వామి

లేపాక్షి: కంచిసముద్రంలో వెలిసిన రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామపెద్దలు, గ్రామస్తులు గురువారం నిర్వహించారు. అనంతరం వేదపండితులు హోమాలు నిర్వహించారు. వేదపారాయణం, ప్రాణప్రతిష్టాపన, పంచామృత అభిషేకం, దుర్గాహోమం, మూర్తి హోమం, రుద్రహోమం, తత్వన్యాస హోమం, కళాహోమం, ప్రతిష్టాపన హోమం తదితర పూజలు నిర్వహించారు. మండల కన్వీనర్ నిస్సార్ అహమ్మద్, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, కోశాధికారి మాధవరెడ్డి, స్పోక్స్‌పర్సన్ మల్లన్న, సీనియర్ నాయకులు చలపతి, నాయకులు ఆనందకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి బంధువులు అందించిన సమాచారం.. గ్రామానికి చెందిన రఘు పావగడలో సోదరితో మాట్లాడి బెంగళూరుకు బైక్‌పై బయలుదేరాడు. హిందూపురం సమీపంలో బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో అతడి తల, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరుకు తీసుకెళ్లారు.

న్యాయం చేయాలని ఫిర్యాదు

హిందూపురం: మనేసముద్రం సమీపంలోని సర్వే నంబర్ 21లో ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని, డబ్బులు వసూలు చేసి, తిరిగి అడిగితే దౌర్జన్యం చేస్తున్నారని బాధిత మహిళలు హిందూపురం డీఎస్పీ మహేష్‌ను గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. పట్టాలు ఇప్పిస్తామని వందలాది మందితో కొందరు డబ్బులు వసూలు చేశారని, అయినా జాబితాలో పేర్లు లేవని, దీనిపై అడిగితే దౌర్జన్యంగా మాట్లాడుతున్నారని వాపోయారు.

పక్కాగా జనన, మరణాల రిజిస్ట్రేషన్



రికార్డులు పరిశీలిస్తున్న గణాంక అధికారులు

పుట్టపర్తి టౌన్: జనన, మరణాల రిజిస్ట్రేషన్‌ను పక్కాగా చేపట్టాలని అదనపు గణాంక అధికారి రాజేంద్రప్రసాద్, సహాయ గణాంక శాఖ అధికారి సూర్యనారాయణ మున్సిపల్ అధికారులకు సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జనన, మరణాల రిజిస్ట్రేషన్‌ను వారు పరిశీలించారు. జనన, మరణాల రిజిస్ట్రేషన్‌లో లోపాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్‌లో నమోదు విషయంలో ఎలాంటి లోపాలు జరగకుండా చూడాలన్నారు. కమిషనర్ క్రాంతికుమార్, శానిటేషన్ అధికారి శివయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల దీక్ష విరమణ

గాండ్లపెంట: మండల కేంద్రంలో 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న పారిశుధ్య కార్మికులు గురువారం దీక్ష విరమించారు. ఈ సందర్భంగా కదిరి డీఎల్‌పీఓ అంజనప్ప, ఈఓఆర్డీ సునిత, పంచాయతీ కార్యదర్శులు కార్మికులు, సీఐటీయూ నాయకులతో చర్చించారు. పంచాయతీలకు నిధులు విడుదలైన వెంటనే బకాయి వేతనాలు చెల్లించేందుకు అధికారులు అంగీకరించారు. దీంతో దీక్ష విరమిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు ప్రకటించారు. చర్చల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాంబశివా, రైతు సంఘం మండల నాయకులు రాజారెడ్డి, ఖాదర్‌బాషా, కార్మికులు అక్కులప్ప, బాలకృష్ణ, ఆంజనేయులు, దొడ్డెప్ప, అనిల్ తదితరులు పాల్గొన్నారు.